క్లుప్తంగా

క్షయ వ్యాధి నివారణపై అవగాహన


మాట్లాడుతున్న టీబీ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వెంకట్

ముదిగొండ: వల్లభి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం బాణాపురంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వెంకట్ మాట్లాడుతూ.. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని, గ్రామంలో 143మంది నుంచి శాంపిల్స్ సేకరిచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించాలి


ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఐద్వా బృందం

మధిర: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి అసౌకర్యంగా ఉందని, నూతనంగా నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించాలని ఐద్వా మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకాయమ్మ తెలిపారు. శుక్రవారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ సందర్శించి సర్వే నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్పిటల్‌లో పేషెంట్లకు సరిపడా పడకలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత బిల్డింగ్ వర్షం కురవడం వల్ల నీళ్లు కారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

నేత్రదానం

వైరా: వైరాకు చెందిన సైతం రాంమోహన్‌రాజు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. అతని కుటుంబ సభ్యులు రాంమోహన్‌రాజు కళ్లను నేత్రనిధికి దానం చేశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల 'పొలం బాట'


కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఈ ప్రసాద్‌బాబు, ఏఈ కావ్య, రైతులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామంలో రైతులతో కలిసి విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం 'పొలం బాట' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్తుపల్లి విద్యుత్ శాఖ ఏడీఈ ప్రసాద్‌బాబు, ఏఈ కావ్య రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరా సమస్యలు, పాటించాల్సిన జాగ్రత్తలతో పాటు కెపాసిటర్ల వాడకంపై అవగాహన కల్పించి, సమస్య తలెత్తిన వెంటనే సమాచారం అందించాని రైతులకు సూచించారు.

వెదజల్లే పద్ధతితో అధిక లాభాలు


వరి విత్తనాలు వెదజల్లే పద్ధతిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వైరారూరల్: వరి వెదజల్లే పద్ధతితో అధిక లాభాలు సాధించవచ్చని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజుఖాన్ తెలిపారు. మండలంలోని దాచాపురం గ్రామంలో వరి విత్తనాలు వెద్దజల్లే పద్ధతిని వారు పరిశీలించి మాట్లాడారు. వెదజల్లే పద్ధతి వలన కూలీల ఖర్చు తగ్గి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సపావత్ సైదులు, రైతులు గుడూరు కృష్ణారెడ్డి, గుడూరు రామిశేషిరెడ్డి, అయిలూరి శ్రీనివాస రెడ్డి తదితరులున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

ఏన్కూరు: ఏన్కూరు మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు పొట్ట కేశయ్య (102) శుక్రవారం మృతి చెందాడు. ఆయన స్వాతంత్ర సమరంలో పాల్గొని వరంగల్ సెంట్రల్ జైల్లో నెల రోజులపాటు జైలు జీవితం గడిపాడు. ఆయన కుమారుడు పొట్ట రామారావు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఉన్నారు. కేశయ్య మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.

డీవీ కృష్ణ వర్ధంతి సభ

తల్లాడ: విప్లవ నాయకుడు, ప్రజాపంథా మాజీ రాష్ట్ర కార్యదర్శి డీ.వీ.కృష్ణ వర్ధంతిని శుక్రవారం టీయూసీఐ ఆధ్వర్యంలో తల్లాడలో నిర్వహించారు. డీవీ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు లాల్ మియా, టీయూసీఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నాయకులు పఠాన్ నాగుల్‌మీరా, సీహెచ్.రాఘవ రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రమణ పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధులకాలం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం


శాంతినగర్‌లో సైడ్ డ్రైయిన్‌లో మురుగు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది (ఫైల్)


తనికెళ్ల వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది (ఫైల్)

కొణిజర్ల: ప్రస్తుతం రోజూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజల రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అలాగే నీటి కలుషితం వల్ల అనారోగ్యాలకు గురవుతారు. ముందుగానే వ్యాధులపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరి చేరవని పలువురు చెబుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా..

వానాకాలంలో మన చుట్టూ ఉన్న పరిసరాలను చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే సగం వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ఇండ్ల చుట్టూ వర్షపునీరు నిలిచి ఉండి చెత్త చెదారం, పిచ్చి మొక్కలు పెరిగితే దోమలు వృద్ధి చెంది వాటి వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధులు మనిషిని కోలుకోకుండా చేస్తున్నాయి. గత ఏడాది జూలైలో చికెన్ గున్యా రకానికి చెందిన జ్వరాలు వచ్చి వందల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రుల పాలయ్యారు. జ్వరం తగ్గినా నొప్పులు తగ్గక నెలలతరబడి బాధపడిన వారు కోకొల్లలు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.
- వానాకాలం కొత్తనీరు వచ్చి చెరువులు, నదుల్లో కలుస్తుంది. దీంతో నీరు రంగు మారి కలుషితం అవుతుంది. అందువల్ల నీటిని కాచి వడపోసి చల్లార్చి తాగడం మంచిది. లేదంటే క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలి.
- ఇంటి చుట్టూ పాత టైర్లు, కొబ్బరిబోండాలు పాత వస్తువులు చూసుకోవాలి. వీటిలో వర్షపు నీరు నిలిచి దోమల వ్యాప్తి పెరుగుతుంది. ఇంటిలో ఉన్న కూలర్లు నీటిని పారబోసి ఉంచుకోవాలి.
- ప్రతి రోజూ డ్రమ్ముల్లో నీటిని పారబోసి కొత్త నీటితో నింపుకోవాలి.
- సాయంత్రం 6గంటలలోపే ఇంటి తలుపులు కిటికీలు మూసేయాలి. దీంతో దోమల ఇంటిలోకి వచ్చే అస్కారం లేదు. వీలైతే దోమతెరలు వాడటం మంచిది.
- వాంతులు, విరోచనాలు అవుతుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

డ్రై డే నిర్వహిస్తున్నాం..



వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. సైడ్ డ్రెయిన్లలో మురుగు తీయిస్తున్నాం. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేక పనులు కొంత వెనక పడినవి. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం.

– ఏ.రోజారాణి, ఎంపీడీఓ, కొణిజర్ల

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం


తుమ్మలపల్లిలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: ఆయిల్‌పామ్ సాగు చేస్తే రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఎంఈఓ డి.బాలాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలపల్లిలో రైతు బండారు నాగేశ్వరరావు స్థలంలో నాటుతున్న మొక్కలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నాలుగేళ్లకు ఆయిల్‌పామ్ చెట్లు గెలలు వేస్తాయని తర్వాత రైతులకు నికర ఆదాయం లభిస్తుందన్నారు. ఎకరానికి 57మొక్కలు నాటాలని, నర్సరీలో ఒక్క మొక్క రూ.193కు కాగా, ఎకరానికి రూ.11001 చెల్లించాలన్నారు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.9,861 పోతే.. రైతు వాటాగా రూ.1,140 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మొదటి మూడేండ్లు రైతులు ఆయిల్ పామ్‌లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కూడా కల్పిస్తుందన్నారు. సన్న చిన్నకారు రైతులు 5 ఎకరాల లోపు సాగు చేస్తే మొక్కలు వేయించే ఖర్చు కూడా లేకుండా ఉపాధిహామీ పథకం కూలీల ద్వారా మొక్కలు నాటించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. ఆసక్తి కల రైతులు తమ సమీపంలో క్లస్టర్ ఏఈఓను కలవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కుమారరాజా, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


వైరా మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గండగలపాడు వాసులు

వైరా/వైరారూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇందిరమ్మ గ్రామ కమిటీల ప్రమేయాన్ని అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గండగలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించి, కమిషనర్ వేణుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేక అద్దె ఇండ్లల్లో నివసిస్తున్న పేదలను విస్మరించి, తమ అనుయాయులకు అర్హత లేకున్నా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, ఈ క్రమంలో అధికారులు విచారణ చేపట్టిన లిస్టు కాకుండా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన అనర్హులైన వారి లిస్టునే ఫైనల్ చేయటం అన్యాయమన్నారు. ఇప్పటికైనా.. అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, మచ్చ మణి, గుమ్మా నరసింహారావు, కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, పల్లెబోయిన వెంకటేశ్వర్లు, రామారావు, విద్యాసాగర్‌రావు, కిన్నెర మోతి, గొడ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రల సందర్శనకు ప్రత్యేక బస్సులు


బస్సులో బయలుదేరుతున్న ప్రయాణికులు

మధిర: యాత్రికులకు తీర్థయాత్రల సందర్శనకు టీజీఎస్‌ఆర్టీసీ మధిర డిపోనుంచి శుక్రవారం రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని మధిర డిపో మేనేజర్ శంకర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన పూజ కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మధిర డిపో నుంచి మల్లూరు (శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి) దేవాలయం, రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క – సారక్క, వరంగల్ భద్రకాళి దేవాలయం, హన్మకొండలోని వేయి స్తంభాల గుడి సందర్శనకు రెండు డీలక్స్ బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 35మంది ప్రయాణికులు ఉంటే ఏ రోజైనా ఎక్కడికైనా బస్సును ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎం సీ.వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, మధిర బస్టాండ్ కంట్రోలర్ రామచంద్రరావు, విలేజ్ బస్ ఆఫీసర్ నాగుల్ మీరా, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై విద్యుత్ సరఫరా నిలిపివేత

మధిర: పట్టణంలో ట్యాంక్‌బండ్‌పై మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు కరెంట్ సరఫరా అవుతోంది. దీనిపై స్పందించిన పట్టణ ఏఈ అనీల్ కుమార్ శుక్రవారం సరఫరా నిలిపివేశారు. మున్సిపల్ శాఖ ప్రమాదరహితంగా లేకుండా ఎలక్ట్రికల్ వైరింగ్‌ని సరిచేసిన తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో జరిగిన గొడవకు సంబంధించి ఏడుగురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పోతురాజు వరలక్ష్మి ఇంట్లోకి గురువారం సాయంత్రం అక్రమంగా ప్రవేశించిన పలువురు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోతురాజు రాంబాబు, ఇంటి కిషోర్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

యువకుడు అదృశ్యంపై..


మనోహర్ (ఫైల్)

కల్లూరు: మండల పరిధిలోని తెలగవరం గ్రామానికి చెందిన నెలకుర్తి శరబంధి కుమారుడు మనోహర్ ఈ నెల 25వ తేదీన తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. శుక్రవారం నెలకుర్తి సృజన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం


అభినేశ్వర్

కల్లూరు: మండల పరిధిలోని పేరువంచకు చెందిన రామడుగు రాంబాబు కుమారుడు అభినేశ్వర్ శుక్రవారం అదృశ్యమయ్యాడు. పదో తరగతి చదువుతున్న భువనేశ్వర్ పది సప్లమెంటరీ ఫలితాలు రావడంతో కల్లూరు వచ్చి కనిపించకుండా వెళ్లాడని స్థానికుల సమాచారం. దీంతో తల్లిదండ్రులు అభినేశ్వర్ కోసం వెతుకుతున్నారు.

మహనీయుడు తూము ప్రకాశరావు


ప్రకాశరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బోనకల్: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు తూము ప్రకాశరావు అని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. మండలంలోని రాయన్నపేట, కలకోట గ్రామాల్లో శుక్రవారం తూము ప్రకాశరావు 42వ వర్ధంతిని నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామసమూహి, బంజర భూములు, ప్రభుత్వ భూములు పేదలకు, దళితులకు దక్కేలా పోరాటాలు నిర్వహించారని, ఆయన ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, బత్తినేని నీరజ, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్, పూర్ణచందర్‌రావు, మడుపల్లి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉచిత వైద్య శిబిరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంత్

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర వ్యాధులతో బాధపడుతున్న బాలికలకు వైద్యాధికారి ప్రశాంత్ వైద్య పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సూపరిండెంట్ కె.సరిత, హెల్త్ అసిస్టెంట్లు సాయిరెడ్డి, అశోక్, వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

ఈ నెల 29న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సత్తుపల్లిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 29న డాక్టర్స్ డే సందర్భంగా.. మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు, సత్యవతి కంటి ఆస్పత్రి అధినేత కట్టా శివాజీ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలి


మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: వ్యవసాయ కూలీలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారానికై పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వ్యవసాయ కూలీలతో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కొణిజర్లలో జులై 4న నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం సత్తుపల్లి డివిజన్ నాయకులు తాటి వీరభద్రం, పి.రాజు, కుమారి, పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్, తాటి చిన్న వీరభద్రం, రాజమ్మ, కలపాల వెంకటేశ్వరరావు, సిద్దెనపల్లి రాంబాబు, మడకం భద్రమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ


మాట్లాడుతున్న రామాంజనేయులు

కల్లూరు: ఏఐటీయూసీ గత కొన్నేళ్లుగా కార్మికులకు అండగా ఉంటుందని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు అధ్యతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేజర్ గ్రామ పంచాయతీతో పాటు పలు గ్రామ పంచాయితీల్లో పని చేసే కార్మికులను మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దామాల దయాకర్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఊడల కృష్ణ, చింతపల్లి శ్రీనివాసరావు, చెరసాని గోపయ్య, లక్ష్మయ్య, గొల్లమందల యశోధ, మోదుగు సీతమ్మ, దామాల చిన్న మునలయ్య, ఆజ్మీరా రాంబాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల అరెస్టుకు ఖండన


తల్లాడ: పోలీసుల అదుపులో గ్రామ పంచాయతీ కార్మికులు

కల్లూరు/తల్లాడ: సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను శుక్రవారం కల్లూరు పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండించింది. సామరస్యంగా ఆందోళన కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను మధ్యలో అరెస్ట్ చేయడం పట్ల ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. తల్లాడ మండలంలోని పలు జీపీల్లో పనిచేస్తున్న కార్మికులను ఎస్సై వెంకటకృష్ణ అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో రాజశేఖర్, మల్లేష్, శేషయ్య, సులేమాన్, గోపాల్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సీపీఎం జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకుడు కోటి సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. సమాజంలో విశిష్ట సిద్ధాంతం కలిగిన రాజకీయ పార్టీ సీపీఎం పార్టీ ఒక్కటేనన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ త్వరలో జరుగునున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యుడు పాపినేని నర్సయ్య, మండల కార్యదర్శి ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో మన గ్రోమోర్ బ్రాంచ్ ప్రారంభం


బ్రాంచ్ ప్రారంభోత్సవంలో అధికారులు

కారేపల్లి: కారేపల్లి మెయిన్ రోడ్డులో మన గ్రోమోర్ స్టోర్‌ను శుక్రవారం తెలంగాణ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. దీని ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు సంస్థ ముందుకొచ్చిందని.. గ్రోమోర్‌లో కొనుగోలు చేసిన వస్తువులకు 30కిలో మీటర్ల పరిధిలో రూ.లక్ష ఖర్చుతో సరఫరా చేయబడుతుందన్నారు. రైతులు భూసార పరీక్షలు చేసుకునేందుకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు లక్కీడ్రా తీసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ ఏరియా మేనేజర్ సంతోష్ కుమార్, స్టోర్ మేనేజర్ మహేష్, ఆర్ఎసీ జనార్దన్, రైతులు తాతా వెంకటేశ్వర్లు, హనుమకొండ రమేష్, మధుసూదన్‌రావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టాన్ని ఉపయోగించుకోవాలి


మాట్లాడుతున్న మహేంద్రనాథ్

కల్లూరురూరల్: తల్లిదండ్రులు, వృద్ధులు, సీనియర్ సిటిజన్ యాక్ట్‌ను ఉపయోగంచుకోవాలని హ్యూమన్ రైట్స్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు మహేంద్రనాథ్ కోరారు. శుక్రవారం ముగ్గు వెంకటాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పిల్లలు తమ తల్లిదండ్రులను పోషించకుండా వృద్ధాప్యంలో నిరాదారణకు గురి చేసినట్లయితే ఈ చట్టం ప్రకారం రక్షణ పొందవచ్చునన్నారు. ఎటువంటి ఆదరణ లేని వృద్ధులకు హ్యూమన్ రైట్స్ సొసైటీ ద్వారా గన్నవరం, కలకుడిమ గ్రామాల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. నడవలేని వృద్ధులకు వారింటికే భోజనాన్ని పంపించే ఏర్పాటు చేస్తున్నామని సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ మణి తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ సొసైటీ బాధ్యులు కువ్వారపు విజయరావు, గోగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా.. కల్లూరు సీహెచ్‌సీ

- ఇక అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి
- అన్ని విభాగాల వైద్యులు కూడా..


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కల్లూరు సీహెచ్‌సీ


ప్రస్తుత పీహెచ్‌సీ భవనం

కల్లూరు: కల్లూరులో నిర్మితమవుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 90శాతం పైగా నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కల్లూరు పీహెచ్‌సీ రెండున్నరేళ్ల క్రితం అప్‌గ్రేడ్ అయ్యి నాటి ప్రభుత్వం రూ. 10.50 కోట్లు నూతన భవనానికి మంజూరు చేయగా అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు 2022లో శంకుస్థాపన చేశారు.

అందుబాటులోకి అన్ని రకాల వైద్య సేవలు..

ప్రస్తుతం ఉన్న భవనంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రాలు నడుస్తున్నాయి. పీహెచ్‌సీ ఇద్దరు వైద్యులు, సీహెచ్‌సీలో ఒక వైద్యుడు విధులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తైతే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. 30 పడకలతో నిర్మితమవుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, డెంటల్, ఇఎన్‌టీ, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్, అనస్తీసియా, డ్యూటీ డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లతో పాటు ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే ల్యాబ్, ఈసీజీ, లేబర్ రూమ్, పోస్టుమార్టం కోసం మార్చురి గది తదితర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్య సేవలు..



సీహెచ్‌సీ నిర్మాణం పూర్తై పోస్టులు మంజూరు ఐతే అన్ని రకాల విభాగాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు పెరుగుతాయి. 30 పడుకల సౌలభ్యం ఉంది. ప్రస్తుతం పీహెచ్‌సీ భవనంలో కేవలం 6 పడకలు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజలు ఇకపై వైద్యం కోసం బయట ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

–బి.రమేష్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్